# పెళ్ళిళ్లు స్వర్గంలో జరుగుతాయి

**-ఎం.వెంకటేశ్వరరావు**

శ్రీనిజ వేగంగా ఇంట్లోకి వస్తూనే విసురుగా విడిచిన చెప్పలు చెరో మూల ఎగిరిపడ్డాయి. ఆమె కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి. స్పీడుగా వచ్చి తండ్రి పక్కన సోఫాలో కూర్చుంది. శ్రీనిజకి మొండితనం ఎక్కువ. ఆమె చేసే ప్రతి పనిలో వేగం, అనుకున్నదానికి అవరోధం ఎదురైతే అన్నం, నీళ్లు కూడా పక్కకి రానీయని పిడివాదం. ప్రభుత్వ బ్యాంకులో మేనేజరుగా పని చేస్తున్న వెంకట్రావు ఏకైక పుత్రిక శ్రీనిజ అభిమతానికి ఏనాడూ అభ్యంతరం చెప్పలేదు. శ్రీనిజ శిరీష్‌ని తీసుకొచ్చి "డాడీ! మేమిద్దరం ప్రేమించుకున్నాం. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం" అని ధైర్యంగా చెప్పినప్పుడు ఈ కాలపు పిల్లలకిది సహజమే అనుకున్నాడు.

శ్రీనిజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నెలకి అరలక్షకి దగ్గరగా సంపాదిస్తోంది. ఆమె ఇష్టపడుతున్న శిరీష్ కూడా ఆమె పనిచేసే కంపెనీలోనే ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్‌గా ఆమె జీతానికి రెట్టింపుగా సంపాదిస్తున్నాడు. ఈడుజోడు చూడముచ్చటగా ఉన్నారు.

వాళ్లిద్దరి ప్రేమని తిరస్కరించడానికి కారణాలు కనిపించడంలేదు వెంకట్రావుకి. ప్రేమ ఆయన అనుభవంలోకి రాని ఆకాశంలో తాయిలమూ కాదు. ఆలోచిస్తున్న వెంకట్రావు మనసు క్షణంలో గతంలోకి చొచ్చుకెళ్లింది.

★★★

నరసరావుపేట సమీపంలో ఉన్న సంతమాగులూరు గ్రామంలో వెంకట్రావు బ్యాంకు క్లర్కుగా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాడు. మితభాషి కావడంవలన ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. బ్రహ్మచారి కాబట్టి బ్యాంకు దగ్గరలోనే ఓ గది అద్దెకు తీసుకుని వంట చేసుకునేవాడు.

ఆ ఊరి చివర పచ్చని పొలాలు, దూరంగా కన్పించే కొండలు, నీళ్లతో నిండుగా పారే కాలువ... ఇవన్నీ వెంకట్రావుని పలకరించే పరిసరాలు. సాయంత్రం బ్యాంకు నుండి రాగానే చేతిలో ఓ పుస్తకం పట్టుకుని కాలువ వడ్డుకు వెళ్లి కూర్చుని చల్లని పిల్లగాలిని ఆస్వాదిస్తూ పుస్తకం చదవడం వెంకట్రావుకు ఉద్యోగం కంటే ఇష్టమైన సద్యోగం.

ఆ రోజు... కాలువ ఒడ్డున నడుస్తున్న వెంకట్రావుకి సడెన్‌గా "అయ్యయ్యో... తప్పుకోండి...తప్పుకోండి... ఎద్దు తరుముకొస్తోంది" అని అరుస్తున్న ఓ అమ్మాయి గొంతు వినిపించడంతో గభాల్న తల వెనక్కి తిప్పి వేగంగా పరుగెత్తుకొస్తున్న ఎద్దునుచూసి కంగారుగా కాలువ గట్టు పక్కనున్న పొలం గట్టువైపు పరుగెత్తబోయి కాలు జారి పొలంలో పడిపోయాడు. బురదలో పడిపోయిన వెంకట్రావు లేవబోయి ఎదురుగా నిలబడ్డ అందమైన అమ్మాయిని కళ్లార్పడం మరచిపోయినట్లుగా చూస్తుంటే "అయ్యయ్యో బురదలో పడిపోయారు లేవండి" అని చేయి అందించింది. మృదువుగా ఉన్న ఆమె చేయి అందుకుని లేచి నిలబడ్డాడు. వెంకట్రావుకి ఒళ్లంతా బురద.

"నేను అరుస్తూనే ఉన్నాను. మీరే గమనించలేదు... సారీ" అని దూరంగా కాలువ గట్టుమీద పరుగెత్తుతున్న ఎద్దును చూసి "అయ్యయ్యో ఎద్దు వెళ్లిపోతోంది. మీరు జాగ్రత్తగా వెళ్లండి" అని ఎద్దుకోసం పరుగెత్తిందా అమ్మాయి.

ఆమె వెళ్లినవైపే చూస్తున్న వెంకట్రావుకి ఆమె అమాయకంగా 'అయ్యయ్యో' అనడం చెవుల్లో మారుమ్రోగుతోంది. పదహారణాల పల్లె పడుచులా ఉందా అమ్మాయి. గుండ్రని ముఖం... పెద్ద కనులు కళ్లముందు మళ్లీ మళ్లీ కనిపిస్తుంటే నెమ్మదిగా కాలువలో దిగి ఒంటి బురద కడుక్కుని ఇంటిదారి పట్టాడు. ఆ రాత్రంతా ఆ అమ్మాయి ఎదురుగా నిలబడి 'అయ్యయ్యో' అంటున్నట్లే అన్పించసాగింది వెంకట్రావుకి.

★★★

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" కాఫీ ఇస్తూ అడిగింది వెంకట్రావు భార్య జానకి.

కాఫీ చప్పరిస్తూ "ఏంలేదు... శ్రీనిజ గురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"ఒక్కరే కూర్చుని ఆలోచించండి. నా మాటేమైనా వింటారా? ఏమిటి?" అంటూ లోపలకు వెళ్లిపోయింది.

భార్య వెళ్లగానే పక్కనే కూర్చున్న కూతురు తలమీద చెయ్యేసి ఆప్యాయంగా...

"ఏమైందిరా! ఎందుకంత కోపంగా ఉన్నావు? ఎవరైనా ఏమైనా అన్నారా?" అడిగాడు.

"శిరీష్ వాళ్ల అమ్మగారు..."

"అరె... శిరీష్ వాళ్లమ్మగారు ఊర్నించి వచ్చారా? ఆవిడేమన్నారు నిన్ను?"

"ఊ... ఆవిడగారికి నేను నచ్చలేదుట"

"ఎందుకని?"

"డాడీ! నిన్న ఆఫీస్ నుంచి వస్తుంటే శిరీష్ వాళ్లమ్మగారు ఊర్నుండి వచ్చారని, నన్ను తనతో తీసుకెళ్లి పరిచయం చేస్తానని రమ్మన్నాడు. నేను ఇంటికొచ్చి డ్రెస్ మార్చుకుని అమ్మని, మిమ్మల్ని తీసుకుని వస్తానన్నాను. కానీ 'మీ పేరెంట్స్‌ని తరువాత తీసుకొద్దువుగానీ, అమ్మ ముందు నిన్ను చూడాలనుకుంటోంది' అని బలవంతంగా తీసుకెళ్లాడు. నన్ను చూడగానే ఆమె అయిష్టంగా మొహం పెట్టింది. ఆ తరువాత నన్ను "వంట చేయడం వచ్చా?" అని అడిగింది.

"కాఫీ, టీ వరకు వచ్చు. నేర్చుకుంటానన్నాను"

"సంగీతం నేర్చుకున్నావా?" అంది.

"నేర్చుకోలేదాంటీ. ఓ మోస్తరుగా పాడగలను" అన్నాను.

శిరీష్ అందుకుని "అమ్మా! శ్రీనిజ టీవీలో పాటల పోటీల్లో కూడా పాల్గొంది" అన్నాడు.

"ఏదీ ఓ పాట పాడు" అందామె.

"లేటెస్ట్ సినిమా పాట పాడాను. ఆమె శాటిస్ఫై అయినట్టులేదు. జీన్స్‌లో ఉండడంతో కాలు మీద కాలేసుకుని కూర్చున్నాను డాడీ! అది తప్పట ఆవిడగారికి"

"సరేరా అందుకని.."

"నేను సాంప్రదాయబద్దంగా లేనుట. అందుకని నచ్చలేదుట" అంటూ కోపంగా శ్రీనిజ లోపలకు వెళ్లింది.

సోఫాలో వెనక్కు వాలిన వెంకట్రావు శిరీష్ వాళ్లమ్మగారు ఈ కాలపు పిల్లలకి తనలా ఆచార వ్యవహారాలు, వంటా వార్పులు, సంగీతం, సాహిత్యాలు వచ్చుండాలని అనుకుంటోంది కాబోలు అనుకున్నాడు. అక్కడే కూర్చున్న వెంకట్రావును మనస్సు గతంలోకి లాక్కెళ్లింది.

***

బ్యాంకులో అక్కౌంట్ ఓపెన్ చేయడానికి వచ్చిన ఆ అమ్మాయిని దగ్గరగా చూసిన వెంకట్రావు మనస్సు అదుపు తప్పుతున్నట్లనిపించింది. అప్లికేషన్‌లో ఆ అమ్మాయి పేరు చూసి "స్వరూప మీరేనా?" అనడిగాడు.

"అవును."

"ఈ ఫారంలో మూడు సంతకాలు పెట్టండి" పెట్టిందామె.

"ఓ అరగంట ఆగి రండి. పాస్‌బుక్ ఇస్తాను" అన్నాడు. ఆమె తలూపి అక్కడున్న బెంచీద కూర్చుంది. ఆ తరువాత ఆమె బ్యాంకుకి వచ్చినప్పుడల్లా కలసిన మాటలతో ఏర్పడ్డ స్వల్ప పరిచయంతో ఆమె ఆ ఊరి పోస్ట్‌మాస్టర్ రాజారాం రెండో కూతురని, డిగ్రీ చదివిందని, ప్రస్తుతం ఖాళీగా ఉందని, పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెల్సుకున్నాడు వెంకట్రావు.

***



మహాశివరాత్రి. కోటప్పకొండ తిరుణాల జన సందోహంతో రద్దీగా ఉంది. చుట్టుపక్కల గ్రామాల నుండి ఎడ్లబళ్లమీద ఎత్తుగా కట్టిన ప్రభలతో రోడ్లన్నీ ఇసుక వేస్తే రాలనంత జనంతో కిటకిటలాడిపోతున్నాయి. వెంకట్రావు కొలీగ్ ప్రసాద్‌తో కలసి వచ్చాడు. సాయంత్రం వరకూ తిరిగి కొండెక్కి శివుణ్ణి దర్శించుకుని కిందకి దిగుతుంటే 'అయ్యయ్యో' అని విన బడగానే తక్కున ఆగిపోయాడు వెంకట్రావు. వెనక్కి తిరిగి చూసేసరికి స్వరూప మరో ఇద్దరమ్మాయిలతో మాట్లాడుతూ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తోంది.

వెంకట్రావు టైము చూసాడు. రాత్రి ఎనిమిది దాటింది. జనం రద్దీ ఎక్కువవుతోంది. వెంకట్రావు ఆగడం ప్రసాద్ చూసుకోలేదు. జనంలో కల్సిపోయిన ప్రసాద్ కోసం వెదుకుతున్న వెంకట్రావును చూసి స్వరూప నవ్వింది.

వెంకట్రావు ఆమె దగ్గరకు వచ్చి "మీ పేరెంట్స్‌తో వచ్చారా?"

"లేదు. మేం ముగ్గురం ఉదయమే వచ్చాం. ఇప్పుడు ఈ జనాన్ని చూస్తుంటే ఇంటికి ఎలా వెళ్లాలో భయంగా ఉంది. మీరెప్పుడెళ్తారు?" అన డిగింది. వెంకట్రావు మనసుకి ఆ క్షణంలో ప్రసాద్‌ని కల్సుకోవాలనిగానీ, అతను చెప్పిన రీతిలో తిరుణాల ఎంజాయ్ చేయాలనీ అన్పించలేదు.

"నేను బయల్దేరుతున్నాను. మీరొస్తానంటే తీసుకెళ్తాను" అన్నాడు సంకోచించకుండా.

స్వరూప సందేహించకుండా వెంటనే తన ఫ్రెండ్స్‌తో కలసి వెంకట్రావును అనుసరించింది. జనం రద్దీని దాటుకుంటూ ఆ ముగ్గుర్నీ అతికష్టం మీద బస్‌లో ఎక్కించి వాళ్లని జాగ్రత్తగా ఇంటికి చేర్చేసరికి అర్ధరాత్రయింది.

"థాంక్సండీ. మా గురించి మీరు త్వరగా వచ్చెయ్యాల్సొచ్చింది" అంది స్వరూప.

"థాంక్స్ చెప్పాల్సింది పరాయివాళ్లకి" కాస్త చొరవ తీసుకుని అన్నాడు వెంకట్రావు.

ఆ తరువాత స్వరూప బ్యాంకుకి వచ్చినప్పుడు, ఊరి చివర కాలువ గట్టున మొదట యాదృచ్ఛికంగా, తర్వాత అప్పుడప్పుడు, అటు పిమ్మట తరచూ కలుస్తుండడంవలన ఇద్దరి మధ్యా హద్దులు దాటని అన్యోన్యత ఏర్పడింది. ఒకర్నొకరు ఇష్టపడుతున్న సంగతి ఇద్దరి మనసులకి తెల్సినా పెదవి విప్పి చెప్పుకోలేని పిరికితనానికి ఫుల్‌స్టాప్ పెడుతూ లవ్ లెటర్ వ్రాసి పోస్ట్‌చేసి లీవులో ఊరెళ్లాడు వెంకట్రావు.

***

నాలుగురోజుల తరువాత తిరిగివచ్చి లెటర్లో రాసినట్లు ఆ రోజు సాయంత్రం స్వరూపని కల్సుకోవడానికి ఉత్సాహంగా కాలువ గట్టుకు వచ్చేసరికి అప్పటికే అక్కడికొచ్చి అతనికోసం ఎదురుచూస్తున్న ఆమెను చూడగానే సర్వం మర్చిపోయినట్లు ఆమెవైపు ఆరాధనగా చూసాడు. నిర్మలంగా ఆమె అతని కళ్లల్లోకి చూసింది. ఆమె కళ్లు అతని మీదున్న ప్రేమని పారదర్శకంగా చూపిస్తున్నాయతనికి.

"ఏంటీ! ఇంత పెద్ద లెటర్ రాసారు. మా నాన్న పోస్ట్‌మేన్ అనే సంగతి మర్చిపోయారా? నాకు లెటరిస్తూ 'ఏంటి? ఎక్కడ్నించి? ఎవరు రాసారు?' అని గుచ్చి గుచ్చి అడుగుతుంటే పిజి కరస్పాండెన్స్ కోర్సు అప్లికేషన్ అని అబద్ధం చెప్పాల్సి వచ్చింది. నువ్వు నాకు నచ్చావని డైరెక్టుగా, ధైర్యంగా నాతోనే చెప్పొచ్చుకదా! మధ్యలో ఈ లెటర్లెందుకు?" అంది.

ధైర్యం వచ్చినట్లు మొహం పెట్టి "అయితే నేను నచ్చానా?" అన్నాడు.

"ఊ..." అని చిన్నగా చిరునవ్వు నవ్వి మెల్లగా వెళ్లిపోయింది.

ఆ తర్వాత రోజులు వాళ్లిద్దరి జీవితాల్లో మరచిపోలేని మధురోహల్ని మిగిల్చాయి. ప్రేమించడానికి హృదయముండాలి. ప్రేమించబడడానికి కొన్ని క్వాలిటీస్ ఉండాలి. ఆ రెండూ ఉన్న వాళ్లద్దరి ప్రేమని ఊరి చివర పచ్చని పొలాలు, కాలువగట్టు, నీటిమీద నుంచి పయనించే పిల్లతెమ్మెర, నింగీ నేల... ఒక్కటేమిటి ఆ పల్లెటూరిలో ఆస్వాదించదగ్గ ప్రకృతి అంతా వాళ్లిద్దర్నే ఆశీర్వదిస్తే, వెంకట్రావు తల్లి మాత్రం అనకట్ట వేసింది.

కొడుకు ఇష్టపడుతున్న స్వరూప జాతకం తెప్పించుకుని చూసి ఒక్క ముక్కలో "వాళ్లదీ మనదీ ఒకే గోత్రం. ఒకే గోత్రపు వాళ్లు అన్నాచెల్లెలు వరసవుతారు. పెళ్లి చేసుకోకూడదు" అని తన అభ్యంతరానికి సరైన కారణం చెప్పినట్లు సమర్థించుకుంది.

అంతటితో ఆపకుండా "నిన్ను చదివించి సంస్కారవంతుణ్ని, ఉద్యోగస్తుణ్ని చేసింది ఇలా కులం, గోత్రం భ్రష్టు పట్టించడానికా? నా కంఠంలో ప్రాణముండగా నేను సమ్మతించను. ఆపైన నీ ఇష్టం" అంది.

అలా తన ప్రేమ ఎలాగూ పెటాకులైంది కాబట్టి ఇప్పుడు కనీసం తన


## ఆరోగ్యానికి అవిసెలు మంచివి

మనం సంప్రదాయంగా వాడుకునే అవిసె గింజలకు ప్రోస్టేట్ క్యాన్సర్ పెరుగుదలను అడ్డుకునే స్వభావం ఉందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయి. రోజువారీ ఆహారంలో అవిసెలు తీసుకుంటున్న బాధితుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ కణుతుల పెరుగుదల 30-40 శాతం నెమ్మదించిందని డ్యూక్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్ పరిశోధకులు వివరించారు. ఈ అధ్యయనాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నా ఫలితాలు ఆశావహంగా ఉండడంతో ఈ వివరాలను ఇటీవలే అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ అంకాలజీ సదస్సులో కూడా చర్చించారు. ఇతరత్రా చికిత్సలతోపాటు ఈ సహజమైన ఆహార పదార్థాలను కూడా తీసుకోవడంవల్ల ఎంతో కొంత లాభమే గానీ నష్టం ఉండదని భావించవచ్చు.

## గుమ్మడి సుగుణాలు

తక్కువ కెలోరీలు అందించే గుమ్మడికాయ అధిక బరువు సమస్యతో బాధపడేవారికి చక్కని ఆహారం. ప్రతి వందగ్రాములకు ఇరవై కెలరీలు మాత్రమే శరీరానికి అందుతాయి. పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. తీపి గుమ్మడిలో బీటా కెరోటీన్ అధికంగా ఉంటుంది. ఇక ఎండిన గుమ్మడి గింజల్లో ప్రొటీన్లు, జింక్, కాపర్ అవసరమైన ఫ్యాటీయాసిడ్లు లభిస్తాయి. గట్టిగా, మృదువుగా మచ్చలులేని గుమ్మడి మంచిది. గుమ్మడిని ఒకసారి తరిగితే వారంరోజులలోపు వాడాలి.

-కె.మంజువాణి



కూతురైనా ప్రేమ పెళ్లి చేసుకోబోతోందని సంతోషపడ్డాడుగానీ దీనికి ఇలా... చిక్కుముళ్లు అడ్డొస్తాయనుకోలేదు వెంకట్రావు.

***

శ్రీనిజ భోజనం చేసి డాబామీదకెళ్తుంటే వెనుకనే వెళ్లాడు వెంకట్రావు.

కూతురు దగ్గరకెళ్లి "ఇంతకీ శిరీష్ ఏమంటున్నాడురా?"

"ఏమంటాడు? వాళ్లమ్మ అభిప్రాయాన్నే అరిగిపోయిన రికార్డులా చెప్పిందే చెప్తున్నాడు."

"మరి నువ్వేమన్నావు?"

"నన్ను నిజంగా ప్రేమిస్తే నాకోసం వచ్చేయమన్నాను."

"తప్పురా శ్రీ! శిరీష్‌కి నాన్నగారు లేరని నువ్వే చెప్పావుగా. మరి నీ కారణంగా తల్లీకొడుకులు విడిపోవడం న్యాయమా? నువ్వే చెప్పు" అన్నాడు.

శ్రీనిజ మౌనంగా ఆకాశంలోకి చూస్తుంటే వెంకట్రావు మనసు వేగంగా తన గతంలోకి తొంగి చూసింది.

***

తల్లి మొండితనంగా కులం, గోత్రం అంటూ చెప్తున్న కారణాల సాకుతో తన ప్రేమని త్యాగం చేసి జీవించగలడా? జీవితంలో ఒకే ఒక్కసారి వచ్చే యవ్వనంలో మనసుకి నచ్చిన స్వరూపని సొంతం చేసుకోవడంలో జాప్యం చేసి జీవితాన్ని మరొకరికి అర్పణ చేసి పశ్చాత్తాపంతో జీవించదలచుకోలేదు వెంకట్రావు. స్వరూప కోసం కొన్నాళ్లు తల్లికి దూరంగా ఉండటానికే నిశ్చయించుకుని తన నిర్ణయం స్వరూపకి చెప్పాడు.

"కన్నవాళ్ల అంగీకారం లేకుండా మనం పెళ్లి చేసుకుని పెద్దగా సాధించేదేముంది? సర్దుకుపోవడం, పిల్లల్ని కనడం... అందర్లాగే మనమూ. అసలు ప్రేమంటే నాకు మొదట్లో సదభిప్రాయం ఉండేదికాదు. కానీ నిన్ను చూసాక ఆ అనుభూతిని అనుభవించాక నా అభిప్రాయం తప్పని, కారణాలతో కట్టేస్తే ఆగేది కాదు ప్రేమని తెల్సుకున్నాను. కానీ మన ఇద్దరి ఇళ్లల్లోనూ మన పెళ్లికి అంగీకారం ఉండదు. ఆశీర్వదించాల్సిన పెద్దవాళ్లు కోపంతో శపించడం మనకి మంచిదంటావా? అందుకని మీ అమ్మకి నచ్చిన అమ్మాయిని ఆవిడ అంగీకారంతో పెళ్లి చేసుకో. నేనూ మీలాంటి మంచి వ్యక్తి తారసపడినప్పుడు ఖచ్చితంగా పెళ్లి చేసుకుంటాను" అని చాలా స్పష్టంగా చెప్పింది స్వరూప. గభాల్న ఆమె చెయ్యి పట్టుకున్నాడు. స్వరూప అతని చేతిని సున్నితంగా విడిపించుకుని "మనకి రాసి పెట్టింది ఇంతే... వెళ్లొస్తాను" అంది భారమైన గొంతుతో, రాలడానికి సిద్ధమవుతున్న కన్నీళ్లతో.

***

వెంకట్రావు మెల్లగా తల పైకెత్తి ఆ రోజుల్లో స్వరూప చెప్పిన మాటల్ని కూతురికి యధాతథంగా ఉపదేశించాడు.

"డాడీ! నాకు అర్థమవుతోంది. బట్ అయాం వెరీ క్లియర్. శిరీష్ లేకుండా నేను జీవించలేను. శిరీష్ వాళ్లమ్మకి నేను నచ్చులేదుగానీ ఆవిడ నాకు నచ్చారు. తప్పు నాదా?" తండ్రి భుజంమీద తల వాల్చి ఏడుస్తున్న కూతుర్ని చూస్తుంటే వెంకట్రావు హృదయం బాధగా మూలిగింది.

"నువ్వూ ఆమెకి నచ్చేలా నేనూ, మీ అమ్మ వెళ్లి మాట్లాడి వస్తాం" అని శ్రీనిజ తల నిమిరాడు ఆప్యాయంగా.

***

శిరీష్ వాళ్లింటికి భార్యతో వెళ్లిన వెంకట్రావుకి ఒక్క మాట కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు శిరీష్ వాళ్లమ్మ. జానకి కూడా మితంగానే మాట్లాడింది. ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆత్రంగా ఎదురుచూస్తున్న కూతురితో "శ్రీ! మా ఇద్దర్నీ చూసి శిరీష్ వాళ్లమ్మగారు చాలా ఫీలయింది. తన కొడుకు ప్రేమలో పడ్డాడని బాధతో నిన్ను అలా అందట. ఆ తరువాత ఆలోచిస్తే 'పిల్లల ప్రేమని తిరస్కరించి తనేం సాధించగలదు?' అనుకుని తన నిర్ణయాన్ని మార్చుకుందట. త్వరలోనే మీ అమ్మాయిని మా కోడలుగా పంపాలని చెప్పింది. ఆ మాట విన్న సంతోషంలో ఆవిడ పేరు అడగడం కూడా మర్చిపోయాను. ఎలాగూ రేపు ముహూర్తాలు పెట్టుకునేటప్పుడు తెలుస్తుందిగా" అంది కూతుర్ని దగ్గరకు తీసుకున్న జానకి.

"అప్పటిదాకా ఎందుకు జానకీ! ఆమె పేరు నాకు మన పెళ్లికి ముందే తెలుసు... ఆమె పేరు స్వరూప" అని మనసులోనే అనుకున్నాడు వెంకట్రావు.

★



## క్రికెట్ అంటే ఎంతో ఇష్టం!

నయనతార యాడ్స్‌లో నటించడానికి అంతగా ఇష్టపడదని చాలామందికి తెలిసిన విషయమే. కానీ అందరి అంచనాలు తారుమారు చేస్తూ 'చెన్నయ్ సూపర్ కింగ్స్' (ఐపిఎల్ క్రికెట్ టీమ్)కి మాత్రం పబ్లిసిటీ చేయడానికి ముందుకొచ్చిందిట. ఇటీవలే ఓ లిక్కర్ కంపెనీ వాళ్లు ఆమెని తమ యాడ్స్‌లో నటించమని, అందుకుగాను ఓ సినిమాకి ఆమెకి లభించే పారితోషికం కంటే రెట్టింపు ఇస్తామన్నా కూడా ఆమె ఒప్పుకోలేదట. కానీ క్రికెట్ అంటే తనకి వున్న అభిమానంతో ఇప్పుడీ టీమ్ పబ్లిసిటీకి ముందుకొచ్చిందిట.

